## క్లుప్తంగా

### తహసీల్దార్‌కు సన్మానం



మంగపేట : తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బైరి వీరస్వామిని ఆదివాసీ సంఘాల నాయకులు మంగళవారం శాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడారు. మండలంలో ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ, తుడుందెబ్బ జిల్లా నాయకులు అన్నెబోయిన సమ్మయ్య, ఆదివాసీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు తోలెం నర్సింహారావు పాల్గొన్నారు.

### అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండండి



వెంకటాపురం (కె) : అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆశోక్ సూచించారు. మండలంలోని తోగుబోరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమంలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బాలలను తప్పనిసరిగా బడికి పంపించాలని చెప్పారు. గ్రామంలోని అపరిచితులు, కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. తొలుత గ్రామంలోని సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

### వాహనాల తనిఖీ



వాజేడు : మండలంలోని చెరుకూరు వద్ద రహదారిపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. అన్ని వాహనాల ను క్షుణ్ణంగా సోదా చేశారు. ప్రయాణికులు, వాహనాల డ్రైవర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల వివరాలు సేకరించారు.

### కార్మికుల వేతనాలు పెంచాలని వినతి



ఏటూరునాగారం : మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ టీఆర్‌ఎస్‌వీ నాయకులు హనుమకొండలోని కార్యాలయంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ) టి.మల్లేశంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. మిషన్ భగీరథ కార్మికులకు ఐడీ కార్డు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొండగొర్ల రాజేష్, లంక రాజు, దుర్గారావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ చేయొద్దు



ఏటూరునాగారం : రెండో ఏఎన్‌ఎంలు చేసే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పనిని మొదటి ఏఎన్‌ఎంలు చేయొద్దని కోరుతూ మండల కేంద్రంలోని ఆకులవారి ఘణపురం సబ్ సెంటర్ వద్ద రెండో ఏఎన్‌ఎంలు వైద్య సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేసి వేడుకున్నారు. ఈ సందర్భంగా రెండో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం తాము చేపట్టిన సమ్మె ముగిసే వరకు తమ పనులను మొదటి ఏఎన్‌ఎంలకు అప్పగించొద్దని వైద్యులను కోరారు. ప్రభుత్వానికి రెండో ఏఎన్‌ఎంలు చేసే కష్టం తెలిసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రొయ్యూర్ పీహెచ్‌సీకి చెందిన ఏఎన్‌ఎంలు పావని, సుగుణావతి, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, సమ్మక్క, భాగ్యమ్మ, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

వాజేడు : తమ విధులను ఇతరులకు ఇవ్వొద్దని కోరుతూ సెకండ్ ఏఎన్‌ఎంలు వాజేడు, పేరూరు పీహెచ్‌సీల్లోని వైద్యులకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్‌ఎంలు మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ విధులను వేరే వాళ్లతో చేయించొద్దని కోరారు.

# నాగజ్యోతిని గెలిపించుకోవాలి



ములుగు : నాగజ్యోతికి చెక్కు అందజేస్తున్న మంత్రి సత్యవతి, రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి

ములుగు : ములుగు ఎమ్మెల్యేగా బడే నాగజ్యోతిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని మంత్రి సత్యవతి రాథోడ్, రెడ్కో చైర్మన్ యేరువ సతీష్‌రెడ్డి ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనను పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో నాగజ్యోతి హైదరాబాద్‌లో మంత్రి సత్యవతి రాథోడ్, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డిలను మంగళవారం కలిసింది. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి నాగజ్యోతిని అభినందించి తమ నెల వేతనాన్ని ఖర్చుల కోసం సాయంగా చెక్కు రూపంలో అందించారు. ములుగు నియోజకవర్గంలో జయకేతనం ఎగరేయాలని సూచించారు. అనంతరం నాగజ్యోతి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. టికెట్ కేటాయించడంలో సహకరించారంటూ కృతజ్ఞతలు తెలిపారు.

**గెలుపే లక్ష్యంగా పని చేయాలి**

స్థానిక ఎమ్మెల్యేగా ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవత్వంతోపాటు ఉద్యమ నేపథ్యం కలిగిన నాగజ్యోతిని గెలిపించుకుంటే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోగిల మహేష్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు శీలం మధు, నాయకులు బైకాని సాగర్, ముడుతనపల్లి మోహన్, మోరె రాజయ్య, రాందాస్ వాంకుడోత్, వెంకటేష్, మాదం సాగర్, మోహన్, భద్రయ్య, లింగమూర్తి, మహ్మద్ ఖాసీం, దేవేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాదం ప్రవీణ్‌కుమార్

# బీఆర్‌ఎస్‌లో మహిళలపై వివక్ష



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్‌ఎస్ తాడ్వాయి : బీఆర్‌ఎస్‌లో మహిళల పట్ల వివక్ష కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించలేదని చెప్పారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసినా ఆ పార్టీ ప్రకటించిన జాబితాలో ఆరుగురు మహిళలకు మాత్రమే అవకాశం లభించడం దుర్మార్గమన్నారు. మొత్తం 115 అభ్యర్థుల్లో కేవలం ఆరుగురు మహిళలకే టికెట్ కేటాయించడం సరికాదన్నారు. సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, సర్పంచ్ ఇర్ప సునీల్, జిల్లా నాయకుడు ఆరెం లచ్చుపటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు సూర్యనారాయణ, రామస్వామి, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి



స్వాధీనం చేసుకున్న గుడుంబాతో పోలీసులు

వెంకటాపురం(కె) : మండలంలోని బెస్తగూడెం గ్రామంలోని గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడి చేసి బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఎస్సై ఆశోక్ కథనం ప్రకారం.. బెస్తగూడెంలో గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. రెండు వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను, సారా తయారీకి వినియోగించే పనిముట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ఎవరైనా గ్రామంలో గుడుంబా తయారు చేసినా, విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# అర్హులందరికీ 'గృహలక్ష్మి' అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగపేట : మండలంలోని అర్హులందరికీ గృహలక్ష్మి సాయం మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ బైరి వీరస్వామికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి యానయ్య మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, ఓసీలకు వర్తింపజేయాలని కోరారు. మండలంలో పేదలు ఎక్కువ సంఖ్యలో ఉన్న క్రమంలో 3,500 ఇండ్లు మంజూరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ తూడి భగవాన్‌రెడ్డి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, నర్రా కిషోర్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీగొండ కాంతారావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, నాయకులు నర్సింహారావు, కాటబోయిన నర్సింహారావు, ఎట్టి సారయ్య, ఎల్పీ.రవి, దిడ్డి లక్ష్మీనర్సయ్య, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత కీలకం



మాట్లాడుతున్న వైద్యాధికారి నిఖిల్‌కుమార్

మంగపేట : ఆరోగ్య పరిరక్షణలో వ్యక్తిగత, పరిసరాల శుభ్రత కీలకమని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు, జ్వరాల బారి నుంచి కాపాడుకునేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాయామం చేయడం ద్వారా రోగనిరోధక శక్తి పెంచుకోవాలని సూచించారు. పాఠశాలలోని 52 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సీఎం సానుకూలం

కాటారం : కాటారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి తెలిపారు. బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ అభ్యర్థిగా పుట్ట మధును సీఎం కేసీఆర్ ఖరారు చేసిన సందర్భంగా పుట్ట మధుతోపాటు జక్కు శ్రీహర్షిణి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆయన నివాసంలో మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను ముఖ్యమంత్రికి వివరించినట్లు శ్రీహర్షిణి తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. త్వరలో నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధిపై సీఎం చొరవ తీసుకుంటారని చెప్పారు. సీఎంను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, పూదరి సత్యనారాయణ ఉన్నారు.

### బీసీ సాయంలో పక్షపాతం తగదు

టేకుమట్ల : బీసీలకు ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల సాయం అమలులో పక్షపాతం తగదని మండలంలోని ఆశిరెడ్డిపల్లి సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలత అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడారు. బీసీ కుల వృత్తులపై ఆధారపడ్డ పేదలకు లక్షల రూపాయల సాయాన్ని ప్రభుత్వం ప్రకటించగా గ్రామంలో 16 మంది దరఖాస్తు చేసుకోగా కొందరు బీఆర్‌ఎస్ నాయకులు పక్షపాత ధోరణితో పేద కుటుంబానికి సాయం అందకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. అలాంటి వాళ్ల వల్ల సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకం నీరుగారే ప్రమాదం ఉందన్నారు. బీఆర్‌ఎస్‌లో తప్పుడు సంకేతాలతో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని అభాసు పాల్జేసేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి నిష్పక్షపాతంగా పేదలకు లబ్ధి చేకూరేలా చూడాలని కోరారు.

### 'ముప్పనపల్లి సహాయ నిధి' సేవలు అభినందనీయం

కన్నాయిగూడెం : అబ్బు సతీష్ ముప్పనపల్లి సహాయ నిధి పేరిట గ్రూపు ఏర్పాటు చేసి సామాజిక సేవలు నిర్వహించడం అభినందనీయమని ఎస్సై సురేష్ తెలిపారు. మండలంలోని ఆ గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మీనారాయణ అనే పేద వ్యక్తి అనారోగ్యానికి గురై హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటుండగా అతడికి మండల ప్రజల సహకారంతో గ్రూపు ఆధ్వర్యంలో మంగళవారం రెండు విడతల్లో రూ.25 వేల సాయం అందించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై సాయం అందజేసి మాట్లాడారు. పేదలను ఆదుకునేందుకు మండల ప్రజలు చేయి చేయి కలపడం హర్షణీయమని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేయడానికి ముందుకొచ్చిన వారిని అభినందించారు. కార్యక్రమంలో శీధరి సుమన్, మునయ్య, అశోక్, సునార్కని మల్లేష్, తిప్పనపల్లి విజయ్, కిరణ్, జనగం మహేష్, సుధాకర్, అంజయ్య, కొయ్యల శ్రీను, భిక్షపతి, ఆదినారాయణ తదితతరులు పాల్గొన్నారు.

### లెప్రసీ మందుల పంపిణీ



వాజేడు : మండలంలోని ప్రగళ్లపల్లి కాలనీలో స్థానిక వైద్యాధికారి మధుకర్, లెప్రసీ డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ (డీఎంఓ) జయరాజ్ రోగులకు మంగళవారం మందులు పంపిణీ చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో కోటిరెడ్డి పాల్గొన్నారు.

### 25 నుంచి ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు

భూపాలపల్లి రూరల్ : ఈనెల 25 నుంచి 27 వరకు గోదావరిఖనిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 16వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల పక్షాన యూనియన్ 1942 నుంచి పోరాటాలు చేస్తోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతోపాటు భవిష్యత్ కార్యాచరణపై మహాసభల్లో చర్చిస్తారని వివరించారు. నాయకులు, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, నాయకులు రాంచందర్, శ్రీనివాస్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరికి గాయాలు

మల్హర్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని కొయ్యూరు బొగ్గుల వాగు వంతెన సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మంథని నుంచి భూపాలపల్లి దిశగా వస్తున్న మారుతి కారును కాటారం నుంచి తాడిచర్ల వైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న మధుసింగ్, భగత్‌సింగ్ గాయాల పాలయ్యారు. మధుసింగ్‌ను పోలీసులు గోదావరిఖనిలోని ఆస్పత్రికి తరలించారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం

- ములుగు ఎమ్మెల్యే సీతక్క



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న సీతక్క

వెంకటాపురం(ఎం) : పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క తెలిపారు. మండలంలోని రామానుజాపూర్, నర్సాపూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా సీతక్క వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్‌లో బుర్రి స్వామి, డొక్కల రామచంద్రు, మైస నరేష్, పెండేల రాజు, మాదాసు కుమారస్వామి, శంకర్‌తోపాటు 20 మంది కార్యకర్తలు చేరినట్లు తెలిపారు. అనంతరం ఇటీవల గాయపడ్డ రామానుజాపూర్ గ్రామానికి చెందిన కన్నబోయిన రాజు, ప్రస్తుత సర్పంచ్ రాజిరెడ్డిని సీతక్క పరామర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి నాయకులు బండి శ్రీనివాస్, నల్లెల్ల భరత్‌కుమార్, పటేల్ రమణారెడ్డి, చక్రపు శ్రీనివాస్, దేవ్‌సింగ్, రాంబాబు, సాదు రాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- బీజేపీ ఒడిశా ఎమ్మెల్యే నారాయణరావు



మాట్లాడుతున్న నారాయణరావు

ములుగు రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఆ పార్టీ ఒడిశా ఎమ్మెల్యే కోడూరి నారాయణరావు అన్నారు. గోవిందరావుపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పదాధికారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థులుగా బీఆర్‌ఎస్ ప్రకటించిన జాబితాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ప్రధాని మోదీ మాత్రం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీలకు 90 శాతం నిధులను కేటాయిస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నారని వివరించారు. ములుగు నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఆదివాసీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్, మండల అధ్యక్షుడు మద్దినేని తేజ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, రుద్రారపు సురేష్, రమేష్, మహేందర్, భూక్య జవహర్‌లాల్, శ్రీకాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కులవృత్తులకు 'బీఆర్‌ఎస్' ప్రాధాన్యం



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి సుధీర్

ములుగు : కులవృత్తులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రమే ప్రాధాన్యత ఇచ్చిందని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 14 బీసీ కులాలకు చెందిన 59 మంది పేద బీసీలకు లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను మంగళవారం ఆమె అందించి మాట్లాడారు. బ్యాంకు లింకేజీ లేకుండా రుణాలు అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. గీత వృత్తిదారులకు పన్ను మాఫీతోపాటు ప్రమాద బీమా ఎక్స్‌గ్రేషియా కూడా పెంచారని చెప్పారు. గొల్ల, కురుమలకు గొర్రెల పంపిణీ, ముదిరాజ్ కులస్తులకు చేప పిల్లల పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎంపీడీఓ ఇక్బాల్, సూపరింటెండెంట్ భాస్కర్, జన్నారపు శ్రీను పాల్గొన్నారు.

# పోలీసుల సేవలు అభినందనీయం

- ఏఎస్పీ సంకీర్త్‌కు సన్మానం



ఏఎస్పీ సంకీర్త్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఏటూరునాగారం : ఇటీవల చోటు చేసుకున్న వరదల నేపథ్యంలో బాధితులకు పోలీసులు అందించిన సేవలు అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏఎస్పీ సంకీర్త్‌ను నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడారు. సుమారు 15 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం కాగా వర్షంలోనూ పోలీసులు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఐ రాజు, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్‌లను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గార ఆనంద్, బట్టు, గోపీ, బట్ట కొమురయ్య, రెబ్బల సత్యం, అంగాల వీరన్న, కునూరు మహేష్, ఎర్రల నాగరాజు పాల్గొన్నారు.

# అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఎస్సై రవికుమార్

మంగపేట : అవగాహన పెంచుకోవడం ద్వారానే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని ఎస్సై రవికుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక యుగంలో సెల్‌ఫోన్లు వినియోగించే ప్రతీ ఒక్కరూ సైబర్ నేరాలపై చైతన్యవంతం కావాలని సూచించారు. దేశంలో తరచూ ఎక్కడో ఒకచోట సైబర్ నేరం జరుగుతూనే ఉందన్నారు. సరైన అవగాహన లేనప్పటికీ పలువురు స్మార్ట్‌ఫోన్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ కారణంగానే సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు గురౌతున్నారని తెలిపారు. అపరిచితులకు ఓటీపీ, ఇతర సమాచారం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ

ములుగు రూరల్ : మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామానికి చెందిన మచ్చిక పద్మ, ఎక్కటి మోహన్, గుజ్జేటి జనార్దన్, బండారుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జంజిరాల దేవయ్య భార్య బతుకమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ములుగు ఎమ్మెల్యే సీతక్క మంగళవారం పరామర్శించారు. అనంతరం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, నల్లెల్ల భరత్‌కుమార్, మేకల ప్రశాంత్, సర్పంచ్ గోల్కొండ శైలజ, సురేష్, తిప్పారపు కిషన్, దేవ్‌సింగ్, మొగిలి, రాజన్న, కుమారస్వామి, రమేష్, కిరణ్ తదితరులున్నారు.

# ఎమ్మెల్యే గండ్రకు శుభాకాంక్షల వెల్లువ

టేకుమట్ల : భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మంగళవారం నాడు స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవి, తిరుపతి, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు సంగి రవి, సంపత్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, చదువు మహేందర్, బందెల నరేష్, మంద రవి, మహ/ పాల్‌రెడ్డి, గందం సారయ్య, కూర సురేందర్‌రెడ్డి, పెరుమాండ్ల మొగిళి, నల్లబెల్లి రవీందర్, అడగాని రామారావు, నిమ్మల స్వామి, పాల శంకర్, నానవేని కుమార్, తదితరులు పాల్గొన్నారు.